# మతపరంగా విభజించే మరో ప్రయత్నం కైరానా

**ఉత్తరప్రదేశ్‌లోని** షామ్లిజిల్లాలో చిన్న పట్టణమైన కైరానా నుండి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వెళ్లిపోయారన్న మరో సమస్య బిజెపి లేవనెత్తింది. "ఒక మతానికి చెందిన వారి నుండి బెదిరింపు వల్ల అనేక హిందూ కుటుంబాలు కైరానా పట్టణాన్ని వదలి వెళ్లిపోయార"ని ఎం.పి హుకుం సింగ్ చెబుతూ అలా భయంతో పారిపోయిన 346 హిందూ కుటుంబాల జాబితాను విడుదల చేశారు. మర్నాడు మరో ప్రకటనలో "ఒక మతానికి చెందిన నేరస్థ శక్తుల బలవంతపు వసూళ్లు, బెదిరింపుల వల్ల" ఆ 346 కుటుంబాలు వెళ్లిపోయాయని ఆయన చెప్పారు. "ఇది మతసంఘటనకు సంబంధించినది కాదు. ఇది హిందువులు, ముస్లిములకు సంబంధించిది కాదు. ఇది శాంతిభద్రతల సమస్య" అని అన్నారు. ముకీమ్‌కాలా, ఫర్హాన్ వంటి ముస్లిం ముఠాలు పశ్చిమ యుపిలో సమస్యగా వున్నాయి అనీ, ఒక రాజకీయ పార్టీ ప్రాపకంతో ఈ స్థానిక నేరశక్తులు కైరానాలో నిలదొక్కుకున్నాయని కూడా అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ ప్రభుత్వ రాజకీయ ప్రాపకంతో స్థానిక ముస్లిం రౌడీలు బలవంతపు వసూళ్లు సాగిస్తున్నందున హిందూ కుటుంబాలు ఇళ్లు వదలి పారిపోయాయని ఎంపి క్రమంగా నిర్ధారించాడు.

346 మంది జాబితా విడుదల చేసిన తర్వాత బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా అలహాబాదులోని ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ కైరానాను సులభంగా వదలమని, సమాజ్ వాదీ పార్టీని ఓడించగలిగేది బిజెపి యేననీ ప్రకటించాడు. కేంద్రంలోని బిజెపి మంత్రులు శాంతి భద్రతలు కాపాడాలంటూ ప్రకటనలు చేశారు. ఇదే నిజమైతే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్య తీసుకోవాలని కేంద్రహోమ్ మంత్రి రాజనాథ్‌సింగ్ ప్రకటించాడు. అదే శాఖ ఉపమంత్రి కిరణ్ రిజిజు ప్రస్తుత ప్రభుత్వ పాలనలో యుపిలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయన్నాడు.

అర్థసత్యాలు, వక్రీకరణలతో బిజెపి నాయకులు ముస్లిములపై బురదజల్లే పనిచేశారు. వారిని బూచిగా చూపిస్తున్నారు. పత్రికలు 346 మంది జాబితాను క్షేత్ర స్థాయిలో పరిశీలించాయి. ది మిల్లి గజెట్ పత్రిక ఇలా వ్రాసింది. "ఈ కైరానా జాబితాలో నల్గురు మృతి చెందిన వారి పేర్లున్నాయి. వారిలో 68 మంది వెనకెప్పుడో కైరానా నుండి వెళ్లిపోయారు. వారిలో 20 కుటుంబాలు ఇప్పటికీ కైరానాలోనే నివశిస్తున్నాయి." బిజెపి నాయకులు ఒక పథకం ప్రకారం ఈ ఆరోపణలు చేస్తున్నారన్నది స్పష్టం. వచ్చే యేడు జరిగే యు.పి ఎన్నికలకు ముందు హిందూ-ముస్లిముల మధ్య అగాధాన్ని సృష్టించేందుకు పూనుకున్నారు.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్, టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రికలు కూడా ఈ జాబితా మోసాన్ని బయటపెట్టాయి. ఉపాధి కోసం వెళ్లినవారి పేర్లు, చనిపోయినవారి పేర్లూ జాబితాలో వున్నాయని తేల్చారు. జాబితాలో పేర్లున్న వారిలో కొందరిని కలవగా ముజఫర్‌నగర్ ఘర్షణలతో ఏర్పడిన వాతావరణంతో అక్కడ బ్రతకడం కష్టమని అక్కడ నుండి వచ్చామని చెప్పారు. జిల్లా అధికార యంత్రాంగం జరిపిన మరో సర్వేలో 15 ఏళ్లకు ముందే 68 మంది, తమ పిల్లల చదువులు, వ్యాపారం, ఇతర కారణాలతో వెళ్లారనీ, చాలామంది చనిపోయినవారి పేర్లున్నాయనీ, కొందరింకా కైరానాలోనే వున్నారనీ తేలింది. బిజెపి పార్టీ కార్యకర్తలే ఈ జాబితా గురించి గందరగోళంలో వున్నారు. కైరానాలో వలసలు జరగలేదని పేర్కొంటూ ఒక నివేదికను కొందరు హిందూ సాధువులు ముఖ్యమంత్రికి అందజేశారు.

ఏబిపి న్యూస్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లు ఈ జాబితా తప్పని తేల్చాయి. ముకీంకాలా రౌడీ ముఠాకు సమాజ్‌వాదీ పార్టీ మద్దతుందన్న బిజెపి ఆరోపణకు ఆధారం లేదని చెప్పారు. 2015 అక్టోబరులో పోలీసులు కాలాను అరెస్టు చేయగా అతనిప్పటికీ జైలులో వున్నాడు. నేరస్తులకు మతం వుండదు. వారి నేరచర్యలను ఏ మతానికి చెందిన వారైనా సమర్ధించరు. వాస్తవానికి ఈ ప్రాంతంలో కాలా రౌడీయిజానికి గురయిన వారిలో ఇతర మతస్తులతో పాటు ముస్లింలూ వున్నారు. ఇతర మతాలలో పుట్టినవారూ రౌడీయిజం సాగిస్తున్నారు. ఈ రౌడీలకు ధన సంపాదనే లక్ష్యం.

దేశంలో నిర్వాసితులైన మైనారిటీ ప్రజలే నాడు బిజెపి నాయకులకు కన్పించలేదు. 346 హిందూ కుటుంబాలు తరలి పోయాయంటూ పెద్ద సమస్యగా చిత్రిస్తున్న బిజెపి నాయకులకు, మంత్రులకు 2007, 2008లో ఒడిషాలోని కందమాల్ జిల్లాలో 50 వేలమంది క్రిస్టియన్లు నిర్వాసితులయితే పట్టలేదు. ముజఫర్‌పూర్, షామ్లి జిల్లాల్లో 2013 లో సాగిన దాడులతో 50 వేలమంది ముస్లిములు నిర్వాసితులై ఇంకా శరణార్థి శిబిరాల్లో నికృష్ట పరిస్థితుల్లో ఉన్నారన్న అంశమూ వారికేనాడూ పట్టలేదు. 2002 గుజరాత్ మతోన్మాద దాడులతో లక్షన్నరమంది నిర్వాసితులై ఈనాటికీ తమ స్వస్థలాలకు తిరిగి చేరుకోలేని నిస్సహాయ స్థితిలో వున్నారు. అనేక మతఘర్షణల్లో అస్సాంలో వందలాది ముస్లిములు నిర్వాసితులయ్యారు.

బిజెపి ఎం.పి. హుకుంసింగ్ కైరానా వలసల్లో మతకోణం లేదని బహిరంగంగా చెప్పినప్పటికీ, సమాజ్‌వాదీ పార్టీ ప్రభుత్వాన్ని విమర్శించే పేరుతో "ఒక మతానికి చెందిన నేరస్థులు" అంటూ బిజెపి సభ్యులు ప్రచారం చేస్తున్నారు. అనేక చోట్ల విద్వేషాలను రెచ్చగొట్టే ఉపన్యాసాలిస్తున్నారు.

ఉత్తరప్రదేశ్‌లో జరగబోయే ఎన్నికల్లో గెలుపు సాధించే లక్ష్యంతో ఒక పథకం ప్రకారం బిజెపి ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టి హిందూ ఓట్లను తాను పొందాలని చేస్తున్న ఈ క్రమంలో ప్రజలలో మతవిద్వేషాలు రగిలిస్తున్న ప్రయత్నాలను ప్రజాతంత్రవాదులు, ప్రజలు ఖండించాలి. ప్రజలను సమైక్యంగా నిలిపేందుకు కృషి చేయాలి.